

మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి పుట్టిన రోజును పురస్కరించుకుని గురువారం కాంగ్రెస్ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అధ్యక్షురాలు, కౌన్సిలర్ కొత్తకుర్మ మంగమ్మ శివకుమార్ దంపతులు కోమటిరెడ్డిని శాలువతో సన్మానించి పూల బోకెను అందజేసి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. తుర్కయంజాల్ మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ నాయకులు కోమటిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు. - హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి

మంత్రి కోమటిరెడ్డిని కలిసిన ఆలయ చైర్మన్



మంత్రిని సన్మానిస్తున్న రఘుమారెడ్డి తదితరులు

చంపాపేట, మే 23 (ఆంధ్రజ్యోతి): చంపాపేట డివిజన్ కర్మన్‌ఘాట్‌లోని హనుమాన్ ఆలయ చైర్మన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు నల్ల రఘుమారెడ్డి గురువారం మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. మంత్రికి ఆయన పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపి స్వామి వారి ప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు బిల్లకంటి కిరణ్‌కుమార్‌గుప్తా, చీర తిరుమలేష్, నాయకులు మేకల రాజశేఖర్‌రెడ్డి, గూడూరు గౌతంరెడ్డి, బాలకృష్ణ, శివ పాల్గొన్నారు.

మరమ్మతు పనులు నాణ్యతతో చేపట్టాలి: కొప్పుల



పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

వనస్థలిపురం, మే 23 (ఆంధ్ర జ్యోతి): తాగునీటి, నాలా లీకేజీ పైప్‌లైన్ పనులు నాణ్యతతో చేపట్టాలని మన్సూరాబాద్ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి అన్నారు. మన్సూరాబాద్ చౌరస్తా నుంచి కామినేని హాస్పిటల్ ప్రధాన రోడ్డు మార్గంలో వినాయకనగర్‌కాలనీ సమీపంలోని ఆయిల్‌మిల్ వద్ద తాగునీటి పైప్‌లైన్ లీకేజీ, ప్రధాన నాలా బ్లాక్ కావడంతో చేపడుతున్న పైప్‌లైన్ పనులను కార్పొరేటర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పైప్‌లైన్ పనులను భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని నాణ్యతతో చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని తహసీల్దార్‌కు వినతి

అబ్దుల్లాపూర్‌మెట్, మే 23(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం పెద్దఅంబర్‌పేట్‌లోని సర్వే నంబర్ 244లోని ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ గురువారం సీపీఎం నాయకులు తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం పీవోటీ చట్టం ప్రకారం స్వాధీనం చేసుకున్న భూమిలో కొందరు అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని తెలిపారు. కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నర్సింహ, గుండె శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌కేపురంలోని కుర్తాళం పీఠం ప్రత్యంగిరా పరమేశ్వరి అమ్మవారిని బలగం చిత్ర దర్శకుడు, జబర్దస్త్ ఫేమ్ వేణు దంపతులు గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. వారికి ఆలయ కార్యదర్శి మునిపల్లె శ్రీనివాస్, సువర్ణలత దంపతులు స్వాగతం పలికి అమ్మవారి జ్ఞాపిక, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో విఠల్ ఆచార్య, అరుణ, సాయికుమార్‌శర్మ, బనగిరి నాగరాజు, హేమంత్, శ్రీపతి, రామశర్మ తదితరులు పాల్గొన్నారు. - ఎల్‌బీనగర్, ఆంధ్రజ్యోతి



బుద్ధ పూర్ణిమను పురస్కరించుకుని గురువారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కమ్మగూడ 22వ వార్డు కౌన్సిలర్ కౌశిక ఐలయ్య ఆధ్వర్యంలో పలువురు మాసబ్ చెరువు కట్టపైన ఉన్న గౌతమ బుద్ధుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు. - హయత్‌నగర్, ఆంధ్రజ్యోతి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, మే 23 (ఆంధ్రజ్యోతి): టీఎస్ఎస్‌పీడీసీఎల్ ఆస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని మరమ్మతు పనుల కారణంగా శుక్రవారం 11కేవీ సంహిత కాలేజ్ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, వెంకటాద్రినగర్ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం ఒంటిగంట నుంచి 2గంటల వరకు, సీ క్వార్టర్స్ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 3.30 నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ హన్మంతరెడ్డి తెలిపారు.

మదర్‌డెయిరీ 11కేవీ ఫీడర్ పరిధిలో..

హయత్‌నగర్ : చెట్టు కొమ్మలు కొట్టివేతలో భాగంగా శుక్రవారం మదర్ డెయిరీ 11కేవీ ఫీడర్ పరిధిలో ఉదయం 11 నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3గంటల నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ ప్రసారం తొలగించడం జరుగుతుందని హయత్‌నగర్ సబ్‌స్టేషన్ ఏఈ ఆంజనేయులు తెలిపారు. దీంతో లెక్చరర్స్‌కాలనీ, బాలాజీనగర్, క్రీడా, డీర్‌పార్కు, త్యాగరాయనగర్, ఆదిత్యనగర్, ఎల్లారెడ్డికాలనీ, హవర్డ్ స్కూల్ ప్రాంతాల్లో ప్రసారానికి అంతరాయం కలుగుతుందని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఇంజాపూర్ సబ్‌స్టేషన్ పరిధిలో..

ఇంజాపూర్ సబ్‌స్టేషన్ 11కేవీ ఫీడర్ పరిధిలోని ఇంజాపూర్‌లోని ఇందిరమ్మకాలనీ, సాయిప్రియకాలనీ, అంజాపురికాలనీ, 11కేవీ ఆఫిల్ ఎవిన్యూ ఫీడర్ పరిధిలోని ఆఫిల్ ఎవిన్యూ కాలనీ, ప్రకాష్‌నగర్, మిధానీకాలనీ, సుందరయ్యకాలనీ, లక్ష్మీనగర్‌కాలనీ, తిరుమలనగర్, శ్రీరంగపురం, సాయినాథ్‌కాలనీ, 11కేవీ సీఆర్‌పీఎఫ్ ఫీడర్ పరిధిలోని మధ్యాహ్నం 3గంటల నుంచి 5గంటల వరకు.. సీఆర్‌పీఎఫ్‌కాలనీ, నీలాద్రినగర్, సాయి దయాకాలనీ, స్నేహపురికాలనీ, దుర్గానగర్, తుల్జా భవానికాలనీ, వెంకటేశ్వరకాలనీ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 11గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని ఏఈ కూతాటి రాములు తెలిపారు.

అంబులెన్స్ డ్రైవర్లు, కార్ల విక్రయ కేంద్రం సిబ్బంది పరస్పర దాడులు

కొత్తపేట, మే 23(ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్ పీఎస్ పరిధి కామినేని వద్ద అంబులెన్స్ డ్రైవర్లు, కార్ల విక్రయ కేంద్రం సిబ్బంది పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఘటన వివరాలు స్థానికులు, ఎస్ఐ శంకర్ కథనం ప్రకారం.. చాలా రోజుల నుంచి ఎల్‌బీనగర్ నుంచి కామినేని చౌరస్తాకు వెళ్లే దారికి కుడివైపు కామినేని ఫ్లైఓవర్ కింద అంబులెన్స్‌లు నిలిపి ఉంచుతున్నారు. ఈ దారిలో ఎడమ వైపు ప్రీ ఓన్డ్ కార్లు విక్రయించే న్యూ మల్టీ కార్స్ షెడ్ ఉంది. బుధవారం సాయంత్రం వారు ఓ కారును అంబులెన్స్ పార్కింగ్ పక్కన దారిపై పార్క్ చేసి ఉంచారు.

ఆ కారును తొలగించాలని అంబులెన్స్ బయటకు వెళ్లడానికి ఇబ్బంది కలుగుతుందని న్యూ మల్టీ కార్స్ షెడ్ సిబ్బందితో అంబులెన్స్ డ్రైవర్లు గొడవకు దిగారు. రెండు వర్గాల మధ్య మాటా మాటా పెరిగి రాడ్లు, కర్రలతో కొట్టుకున్నారు. గొడవ ఆపాలని వారిని ట్రాఫిక్ పోలీసులు సమాధాన పరిచే యత్నం చేసి, గాయాలపాలైన వారిని ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఇరువర్గాల వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు. న్యూ మల్టీ కార్స్ షెడ్ తరఫున ఆయాన్‌ఖాన్(34) అంబులెన్స్ డ్రైవర్లపైనా, అంబులెన్స్ డ్రైవర్ల తరఫున బొడ్డు రవి(40) న్యూమల్టీ కార్స్ షెడ్ సిబ్బందిపైనా ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అటకెక్కిన ఇంకుడు గుంతల లక్ష్యం

● నిర్వహణలో అధికారుల నిర్లక్ష్యం



సత్యానగర్‌లో ఇంకుడు గుంత

కొత్తపేట, మే 23(ఆంధ్రజ్యోతి): భూగర్భజలాలు అడుగంటి పోకుండా ప్రతీ వర్షపు బొట్టూ కాపాడుకోవాలంటూ, భూగర్భ జలమట్టం పెంచడమే లక్ష్యంగా ఏడేండ్ల క్రితం ఆర్భాటంగా కాలనీల్లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతల పరిస్థితి దారుణంగా తయారైంది. జలమండలి అధికారుల నిర్వహణ లోపానికి అద్దంపట్టేలా ఉంది ఇంకుడు గుంతల దుస్థితి. కాలనీ వాసుల అలసత్వం తోడై ఇంకుడుగుంతలు దారుణంగా తయారయ్యాయి. కొత్తపేట డివిజన్ కాలనీల్లో జలమండలి సిబ్బంది ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతల స్థానంలో ప్రస్తుతం మట్టికుప్పలు, చెత్తాచెదారం, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. కాలనీల సంక్షేమ సంఘాల వారు పట్టనట్టు వ్యవహరించడంతోనే ఈ దుస్థితి కొనసాగుతోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జలమండలి సూచనలు బేఖాతరు..

ఇంకుడు గుంతలను వ్యర్థాలు లేకుండా శుభ్రంగా ఉంచాలని, అందులో చెత్తాచెదారం వేయరాదని, మల మూత్ర విసర్జన చేయరాదని, వర్షం కురిసిన తర్వాత ఇంకుడుగుంతలో పైనున్న ఇసుక లేయర్‌ను మార్చాలని, గుంత చుట్టూ ఉండే గోడ ధ్వంసమైతే మరమ్మతులు చేపట్టాలని, మురుగునీరు, కలుషిత జలాలు గుంతల్లోకి చేరకుండా వర్షంనీరు మాత్రమే గుంతలోకి చేరేలా జాగ్రత్తలు తీసుకోవాలని జలమండలి అధికారులు సూచనలిచ్చారు. ఈ సూచనలను ఎవరూ ఖాతరుచేయకపోవడంతో ఇంకుడు గుంతల లక్ష్యం ఆవిరవుతోంది.

ఇళ్లలో కొన్ని అపార్టుమెంట్లలో మాత్రం ఇంకుడు గుంతల నిర్వహణ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. బయట, అంతర్గత దారుల పక్కన నిర్మించిన ఇంకుడు గుంతలు ఎలాంటి జాగ్రత్త/నిర్వహణ చర్యలు తీసుకోకపోవడం ప్రజల అలసత్వమేనంటున్నారు. మారుతీనగర్, కొత్తపేట, సత్యానగర్, న్యూమారుతీనగర్, జనప్రియ అవెన్యూ తదితర ప్రాంతాల్లో వీటి పరిస్థితి దారుణంగా తయారయింది.

అధికారులు, కాలనీల వారూ పట్టించుకోక..

ఇళ్ల బయట దారుల పక్కన, పలు ప్రాంతాల్లో అధికారికంగా ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతల బాగోగులను అటు అధికారులు, ఇటు కాలనీల ప్రతినిధులూ పట్టించుకోవడం లేదు. పలు చోట్ల ఇంకుడు గుంతల గోడలు ధ్వంసమై, వ్యర్థాలకు, చెత్తకు నిలయాలుగా మారాయి. ఇంకుడు గుంతల నిర్వహణపై జలమండలి సూచనలను ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. సత్యానగర్‌కాలనీలో నాలుగు ఇంకుడుగుంతల్లో మూడు కనుమరుగయ్యాయి. ఒకటి మాత్రమే కనిపిస్తోంది. అదీ అధికారుల నిర్లక్ష్యానికి, ప్రజల అలసత్వానికి గుర్తుగా నిలుస్తున్నాయి.

ధాన్యం తడిసిపోకుండా టాటిపత్రులను అందించండి

● వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో కలెక్టర్ శశాంక



ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్ శశాంక

అబ్దుల్లాపూర్‌మెట్, మే 23(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండల పరిధిలోని బాచారం గ్రామంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం రంగారెడ్డి కలెక్టర్ శశాంక సివిల్ సప్లయ్, జిల్లా కో-ఆపరేటివ్ అధికారులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కేంద్రంలో నిల్వ ఉన్న ధాన్యం రాసులను పరిశీలించారు. అనంతరం కొనుగోలు కేంద్రం వద్ద ఉన్న రైతులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నేటి వరకు ఇక్కడ ఎంత ధాన్యం కొనుగోలు చేశారు. ఇంక ఎంత ధాన్యం ఇక్కడ ఉన్నదని అధికారులను ప్రశ్నించారు. ఈ కేంద్రం ద్వారా 85మంది రైతుల నుంచి 600 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు సెంటర్ ఇన్‌చార్జి కలెక్టర్‌కు తెలిపారు. కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. వర్షం పడితే ధాన్యం తడిసిపోకుండా రైతులకు టాటిపత్రులను అందించాలని అధికారులకు ఆదేశించారు. కేంద్రానికి చేరిన ధాన్యంను వెంటనే సేకరించాలని అదేవిధంగా రైతుల ఖాతాల్లో డబ్బులను జమచేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీఎం విజయలక్ష్మి, డీసీఓ ధాత్రిదేవి, డీసీఎస్ఓ ఎంకే రాథోడ్, అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ రవీందర్‌దత్, హయత్‌నగర్ పీఏసీఎస్ చైర్మన్ చామ కృష్ణారెడ్డి, ఏఈఓ లక్ష్మణ్, పీఏసీఎస్ సీఈవో మల్లికార్జున్, సెంటర్ ఇన్‌చార్జి చంద్రశేఖర్, మాజీ ఎంపీటీసీ కృష్ణారెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

హయత్‌నగర్‌లో చెరువు కాల్వపై కబ్జా తొలగింపు..!

● స్పందించిన రెవెన్యూ, లేక్, ఇరిగేషన్, సర్వే అధికారులు



జాలు కాల్వ పైన నిర్మించిన ప్రహరీని కూల్చివేసిన అధికారులు

హయత్‌నగర్, మే 23 (ఆంధ్రజ్యోతి): అన్మగల్ హయత్‌నగర్‌లో జాలు కాల్వను కబ్జా చేసి దానిపైన నిర్మించిన ప్రీకాస్టు కాంపౌండ్ వాల్‌ను ఉదయం వివిధ శాఖలకు చెందిన హయత్‌నగర్ మండల అధికారులు తొలగించారు. 'హయత్‌నగర్‌లో దర్జాగా చెరువు జాల కాల్వ కబ్జా' శీర్షికన ఆంధ్రజ్యోతి దినపత్రికలో గురువారం ప్రచురితమైన కథనానికి అధికార యంత్రాంగం స్పందించింది. ఉదయం 10గంటలకు జీహెచ్ఎంసీ లేక్ ఏఈ నాగరాజు, హయత్‌నగర్ మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నర్సింహయాదవ్, మండల సర్వేయర్ జ్యోతి, లేక్ వర్క్ ఇన్‌స్పెక్టర్ సామ సత్తిరెడ్డిలతో కలిసి అధికారులు కబ్జాకు గురి అయిన కాల్వను పరిశీలించారు. తుర్కయంజాల్ మాసబ్ చెరువు నుంచి హయత్‌నగర్ బాతుల చెరువు వరకు 33 ఫీట్ల కాల్వ ఉందని గుర్తించారు. అక్కడే ఉన్న సర్వేయర్ కాల్వపై కొలతలు తీశారు. ఆక్రమణదారుడు పూర్తిగా కాల్వను కబ్జా చేసి దానిపైనే ప్రీ కాస్టు వాలును నిర్మించాడని తేల్చారు. డోజర్‌తో కాంపౌండ్ వాల్‌ను తొలగిస్తుండగా ప్లాటు తనదంటు వచ్చి ఓ వ్యక్తి అడ్డుపడ్డాడు. తొలగించవద్దని అధికారులను బయభ్రాంతులకు గురి చేశాడు. తాను కాంగ్రెస్ పార్టీ లీడర్‌నని ఎలా తొలగిస్తారని అడ్డుపడ్డాడు. కబ్జాకు గురి అయిన మొత్తం కాల్వ కబ్జా తొలగించాలని డిమాండ్ చేశారు. అడ్డు వస్తే కేసులు పెట్టాల్సి వస్తుందని అధికారులు హెచ్చరించడంతో సదరు వ్యక్తి అక్కడి నుంచి తప్పుకున్నాడు. వెంటనే అధికారులు కాల్వపైన నిర్మించిన ప్రీ కాస్టు వాలును తొలగించారు. ఆక్రమణకు గురి అయిన కాల్వ మొత్తం సర్వే చేసి ఆక్రమణలను తొలగిస్తామని జీహెచ్ఎంసీ లేక్ ఏఈ నాగరాజు స్పష్టం చేశారు. అనంతరం రైస్ మిల్లు పక్కన ఆక్రమణకు గురి అయిన కాల్వను కూడా అధికారులు పరిశీలించారు. కాల్వపైన నిర్మాణాలు చేపట్టడం చట్ట విరుద్ధమని అన్నారు.

గౌరెల్లిలో అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోండి

● జిల్లా పంచాయతీ అధికారికి బీఎస్పీ నేతల ఫిర్యాదు



అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేస్తున్న మల్లేష్ తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, మే 23(ఆంధ్రజ్యోతి): అబ్దుల్లాపూర్‌మెట్ మండలం గౌరెల్లిలో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బీఎస్పీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం అధ్యక్షుడు గ్యార మల్లేష్ బుధవారం సాయంత్రం జిల్లా పంచాయతీ అధికారి సురేష్‌మోహన్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామంలోని సర్వే నంబర్ 206, 191లో పురం బలవంతరెడ్డి అనే వ్యక్తి సుమారు 600 గజాల స్థలంలో తప్పుడు అనుమతులతో ఎలాంటి నిబంధనలు పాటించకుండా నిర్మాణం చేపడుతున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయంపై పలుమార్లు ఎంపీవో, పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని తెలిపారు. పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా మండల పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని తెలిపారు. అక్రమ నిర్మాణదారులకు వత్తాసు పలుకుతున్న మండల అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే ఆ అక్రమ నిర్మాణాలను నిలిపివేయించేలా ఆదేశాలు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. లేని పక్షంలో కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో చిత్రం కృష్ణ, ప్రహ్లాద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

సోషియాలజీలో కొత్త కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

● నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్. బీమా



సోషియాలజీ కోర్సుల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ ప్రొ. బీమా

బర్కత్‌పుర, మే 23 (ఆంధ్రజ్యోతి): సోషియాలజీలో నూతనంగా ప్రవేశపెట్టిన కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్. బీమా సూచించారు. గురువారం కళాశాలలో సోషియాలజీ కోర్సుల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోషియాలజీలో కోర్సులను పూర్తిచేసిన విద్యార్థులు మెరుగైన ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. నిజాం కళాశాల సోషియాలజీ విభాగం ఇన్‌చార్జి హెడ్ డాక్టర్. డి. తిరుపతి మాట్లాడుతూ బీఏ సోషియాలజీలో (హెచ్ఎస్‌జీ, పీఎస్‌పీ, పీఎస్ఎం, ఎస్‌యూపీ) నాలుగు గ్రూప్‌లతో నూతన కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంఏ సోషియాలజీలో పీజీ డిప్లొమా ఇన్ క్రిమినాలజీ అండ్ కరక్షనల్ అడ్మినిస్ట్రేషన్, పీజీ డిప్లొమా ఇన్ డెవలప్‌మెంట్ మేనేజ్‌మెంట్ అండ్ రీసెర్చ్ మెథడాలజీ, హ్యూమన్ రైట్స్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కోర్సులను అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుంచే విద్యార్థులు నూతన కోర్సులలో చేరవచ్చని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్. పి.మాలతి, డాక్టర్. సీహెచ్. పరంధాములు, స్టూడెంట్ అడ్వయిజర్ మహ్మద్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

దైవదర్శనానికి వెళ్లి వస్తూ అనంతలోకాలకు..

● కారు బోల్తా.. భార్య మృతి, భర్త పరిస్థితి విషమం
● ఇద్దరూ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు
● నల్లగొండ జిల్లా తిప్పర్తిలో ఘటన



ప్రమాదంలో మృతిచెందిన రేఖప్రియాంక



నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల కేంద్రంలో బోల్తా పడిన కారు

తిప్పర్తి, మే 23: కుటుంబ సమేతంగా దైవదర్శనానికి వెళ్లి వస్తుండగా కారు బోల్తా పడి భార్య మృతిచెందింది. భర్త పరిస్థితి విషమంగా ఉంది. గురువారం నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలకేంద్రంలో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని కొండాపూర్‌కు చెందిన చలువాది వెంకటశివ(33), ఆయన భార్య రేఖప్రియాంక(31) ఇద్దరూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు. తమ కుమారులు నిక్షిత్(6), తేజ్‌వర్ధన్(3)తో కలిసి దైవదర్శనం నిమిత్తం ఈ నెల 21న తిరుపతి బయలుదేరారు. సొంత కారుకు హైదరాబాద్‌కు చెందిన కడియపుడి మహేంద్రను డ్రైవర్‌గా మాట్లాడుకున్నారు. దర్శనం అనంతరం బుధవారం రాత్రి తిరుపతి నుంచి హైదరాబాద్‌కు వస్తున్నారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ దాటిన తర్వాత గురువారం తెల్లవారుజామున డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో కారు అదుపు తప్పి బోల్తా పడింది. కారులో ఉన్న రేఖప్రియాంక అక్కడికక్కడే మృతి చెందింది. వెంకటశివ, ఇద్దరు కుమారులు, డ్రైవర్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వెంకటశివను గురువారం సాయంత్రం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



బాక్స్ డ్రైన్ పనులు చేపట్టిన చోట్ల ప్రమాదకరంగా తయారైన దారి

బాక్స్‌డ్రైన్ పనులు చేపట్టారు.. గుంతలను పూడ్చడం మరిచారు

కొత్తపేట, మే 23(ఆంధ్రజ్యోతి): కొత్తపేట గాయిత్రీపురం - ఎస్ఆర్ఎల్‌కాలనీ దారిలో రెండేండ్ల పాటు కొనసాగిన బాక్స్‌డెయిన్ పనులు ముగిసి నెలలు గడుస్తున్నా పాడైన దారిలో మరమ్మతులు చేపట్టలేదు. దీనికి తోడు భారీ వర్షాలకు బాక్స్‌డెయిన్ పక్కన తాత్కాలికంగా పోసిన మట్టి వరద నీటికి కొట్టుకుపోయి, వ్యర్థాలు, కంకరరాళ్లు బయటపడ్డాయి. గాయిత్రీపురం మీదుగా ఎస్ఆర్ఎల్ కాలనీ, సత్యానగర్, మారుతీనగర్ తదితర కాలనీల వారికి వాహన ప్రయాణం ప్రమాదకరంగా మారింది. జలమండలి అధికారులు అక్కడక్కడా గుంతలున్నట్లు బారికేడ్ ఏర్పాటు చేశారు. దారి పరిసరాల్లో ఉండే వారే ప్రమాదకరమని సూచించేలా కర్రలు, చెక్క బోర్డు ఏర్పాటు చేశారు. రాత్రి వేళ వాహన ప్రయాణం ఇబ్బందికరంగా మారింది. పాడైన దారుల్లో జీహెచ్ఎంసీ/జలమండలి మరమ్మతులు వెంటనే చేపట్టడానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న జనార్దనమూర్తి, శంకరనారాయణ

విద్యాదానం ఉన్నతులుగా నిలబెడుతుంది

చిక్కడపల్లి, మే 23 (ఆంధ్రజ్యోతి): కళా విద్యాదానం ఉన్నతులుగా నిలబెడుతుందని, జీవితాలను కాపాడుతుందని ప్రముఖ జర్నలిస్ట్, హాస్యావధాని శంకరనారాయణ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో గురువారం రాత్రి రచయిత అంజన గోలి(అమెరికా) రచించిన బెటర్ ట్రాజెక్టరీస్ ఆంగ్ల వ్యాస సంపుటి గ్రంథావిష్కరణ కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. ముఖ్యఅతిథిగా గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి పాల్గొని పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శంకరనారాయణ మాట్లాడుతూ అంజన గోలి అమెరికాలో స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో విద్య అభ్యసిస్తూ పలు సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ వ్యక్తిత్వ వికాస వ్యాస రచనతో సాహితీసేద్యం చేస్తున్నారని ప్రశంసించారు. ఏడు విభాగాలలో నేటి యువతరానికి మార్గనిర్దేశనం చేసే అంశాలు అంజన ఈ పుస్తకంలో ప్రస్తావించారని వివరించారు. జనార్దనమూర్తి మాట్లాడుతూ అంజన గోలి సోదరితో కలిసి గానసభలో చిన్ననాడు గీతా శ్లోకాలు ఆలపించిన విషయం గుర్తుచేశారు. ప్రముఖ జర్నలిస్ట్ ఎల్లాప్రగడ మల్లికార్జునరావు సంపుటిని విశ్లేషణ చేస్తూ మానవ జీవితం సన్మార్గంలో నడవడానికి దానం, ధర్మగుణం అవసరమని వాటిగురించి అంజన వివరించారని తెలిపారు. మంచి సమాజ నిర్మాణం కోసం ఉత్తమ సాహిత్యం అవసరమన్నారు. సాహితీవేత్త విశ్వేశ్వర రావు సంపుటిలోని అధ్యాయాలను పరిచయం చేశారు.

అనారోగ్యం, భార్యతో ఎడబాటు..

● భరించలేక ఉరేసుకొని బలవన్మరణం

అల్వాల్, మే 23(ఆంధ్రజ్యోతి): భార్యభర్తల మధ్య జరిగిన గొడవలు, మనస్పర్థల కారణంగా ఆ దంపతుల కేసు చివరకు విడాకుల వరకు వచ్చింది. దానికి తోడు అనారోగ్యం తోడవడంతో ఓ వ్యక్తి జీవితంపై విరక్తి చెంది ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఇందిరానగర్ కానాజీగూడ ప్రాంతానికి చెందిన పల్లె ప్రమోద్‌కుమార్(40) తన తల్లితో కలిసి నివసిస్తున్నారు. భార్య సౌజన్యతో కొన్ని సంవత్సరాలుగా మనస్పర్థల కారణంగా ఇద్దరి మధ్య తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఆ దంపతులు విడాకుల కోసం కోర్టును ఆశ్రయించారు. ప్రస్తుతం విడాకుల కోర్టులో ఉన్నారు. దీంతో ప్రమోద్‌కుమార్ మానసికంగా కుంగిపోయాడు. దానికి తోడు అనారోగ్యానికి గురవడంతో జీవితంపై విరక్తి చెందాడు. బుధవారం రాత్రి తన తల్లితో కలిసి భోజనం చేసి, తన రూమ్‌లోకి వెళ్లి పడుకున్నాడు. గురువారం ఉదయం 7 గంటలకు నల్లానీళ్లు పడుదామని తల్లి ప్రమోద్‌కుమార్‌ను పిలువగా పలకలేదు. దీంతో వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

బర్కత్‌పుర: పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని వ్యక్తి రైలుఢీకొని మృతి చెందిన సంఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలోని సీతాఫల్‌మండి రైల్వేస్టేషన్ వద్ద జరిగింది. హెడ్‌కానిస్టేబుల్ తెలిపిన వివరాల ప్రకారం.. 28ఏళ్ల వయస్సు గల గుర్తుతెలియని వ్యక్తి రైల్వేస్టేషన్‌లోని ఐదో ప్లాట్‌ఫాం వద్ద పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. తీవ్రగాయాలు కావడంతో ఆస్పత్రికి తరలిస్తుండగా మృతిచెందాడు. మృతుడి శరీరంపై పింకు కలర్ టీషర్టు, నీలిరంగు జీన్స్ పాయింట్ ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

డీసీఎం ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడి మృతి

కొత్తపేట: ఎల్‌బీనగర్ పీఎస్ వద్ద రింగ్ రోడ్డు నుంచి ఫ్లై ఓవర్‌పై టీకేఆర్ కమాన్ వైపు వేగంగా వెళ్తున్న డీసీఎం వాహనం రోడ్డు దాటుతున్న ఓ వృద్ధుడిని ఢీ కొట్టడంతో అతడు అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్ఐ శంకర్ కథనం ప్రకారం.. గురువారం ఉదయం 7.30 ప్రాంతంలో రింగ్ రోడ్డు నుంచి ఫ్లై ఓవర్‌పై టీకేఆర్ కమాన్ వైపు వేగంగా వెళ్తున్న డీసీఎం వాహనం రోడ్డు దాటుతున్న ఓ గుర్తు తెలియని వృద్ధుడిని ఢీకొట్టింది. దీంతో అతడి తలపై నుంచి వాహనం వెళ్లడంతో తల ఛిద్రమై మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, వృద్ధుడి మృతదేహాన్ని ఉస్మానియా మార్చురీకి తరలించి భద్రపరచారని, వృద్ధుడు తెల్లటి పంచె కట్టుకున్నాడని ఎస్ఐ తెలిపారు.